క్లుప్తంగా

వైభవంగా జైనుల గ్రామోత్సవం



ఆచంటలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న జైనులు

పెనుగొండ: దేశం నలుమూలల నుంచి వచ్చిన జైనులు ఆచంటలో జైనులు గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆచంటలో నూతనంగా నిర్మించిన రాజేంద్ర సూరీశ్వరీజీ గురు ధ్యాన జైన మందిర ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా జైన్ భక్తులు, జైన్ గురువులతో శనివారం భారీ గ్రామోత్సవం నిర్వహించారు. గుర్రాలు, ప్రత్యేక రథాలుతో పురవీధుల్లో జైనుల భక్తి పాటలతో ఉత్సవం నిర్వహించారు. జైన మందిరంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో గ్రామంలో ఆచంట పండుగ వాతావరణం నెలకొంది. ఆదివారం ఉదయం జైన్ మందిరం ప్రతిష్ట మహోత్సవం కనుల పండుగగా నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. జైన్ ట్రస్టు ఛైర్మన్ అజిత్‌కుమార్ జైన్, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

జైనుల రాకతో ఆచంటకు గుర్తింపు

జైనుల రాకతో ఆచంటకు మంచి గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం ఆచంటలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆచంట మదన గోపాల స్వామి ఆలయం వద్ద జైనుల 23వ తీర్థంకుడు పార్శ్వనాథుని విగ్రహాన్ని ప్రభుత్వ ఆదేశాలు, గ్రామస్థులు, అఖిల పక్షం సభ్యుల అంగీకారంతో ఆదివారం జైనులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి,జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు, వైస్ ఎంపీపీలు నాగరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులకు పింఛన్లు ఇవ్వాలి



బస్టాండ్ వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

నరసాపురం: రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులకు రాష్ట ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలని రిటైర్డ్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. శనివారం ఉభయగోదావరి జిల్లాల సంఘ నాయకులు నరసాపురం బస్టాండ్ వద్ద ఆందోళన చేసి నరసాపురం డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఆర్టీసీ కార్మికులు చాలీచాలని జీతాలతో జీవితమంతా కష్టపడి, రిటైర్ అయ్యాక సరైన ఆర్థిక ఆసరా లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులు అందరికీ వృద్ధాప్య పింఛన్‌ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నరసాపురం డిపో సెక్రటరీ ఘంటశాల సూర్యనారాయణ, ఎ.నర్సింహరావు, ఆర్ఎస్ కుమార్, సీహెచ్ విష్ణు, ఎంవీకే రావు, బ్రహ్మయ్య, జీవీ రావు, కె.కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పీజీఆర్ఎస్ ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సోమవారం నుంచి యథావిధిగా జరుగుతుందని ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావేదిక ఎన్నికల కోడ్ వల్ల నిలుపుదల చేయగా కోడ్ ముగియడంతో యథాప్రకారం ప్రతి సోమవారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంతో పాటు డివిజన్‌లోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. మండలస్థాయి అధికారులు, తహసీల్దార్ కార్యాలయం అధికారులు ఉదయం 10 గంటలకు కార్యాలయం వద్ద హాజరుకావాలని కోరారు.

కలశాలతో మహిళల ఊరేగింపు



కలశాలతో ఊరేగుతున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని కొత్తపేటలో నూతనంగా ప్రతిష్టాపన చేయనున్న శ్రీ నీలకంఠేశ్వరస్వామి, శ్రీ చౌడేశ్వరిదేవి విగ్రహాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. శనివారం దేశాలమ్మ గుడి నుంచి సుమారు 500 మంది మహిళలతో కలశాల ఊరేగింపు, కోలాటం, కేరళ వాయిద్యాలు, వివిధ సన్నాయి మేళాలతో స్వామివారు, అమ్మవార్ల విగ్రహాలను అత్యంత వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో మానెం బసవరాజు, శీరం ఆనందకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనార్ధనస్వామి ఉత్సవాలు ప్రారంభం

పెనుగొండ: పెనుగొండ క్షేత్ర పాలకుడు జనార్ధన స్వామి కల్యాణోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభించారు. తొలిరోజు అంకురార్పణ, ధ్వజారోహణ, హోమాలు బలిహరణ నిర్వహించారు. జనార్ధన స్వామికి సహస్ర నామార్చనలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో చెరుకువాడ చెన్నకేశవ కోలాట భజన మండలి ఆధ్వర్యంలో కోలాట భజనలు నిర్వహించారు.

ఘనంగా మహిళా దినోత్సవం

నరసాపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. మహిళా వైద్యులు, సిబ్బంది కేక్ కట్ చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.సుప్రియ మాట్లాడుతూ మహిళలు మంచి మంచి చదువులు చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మీప్రశాంతి, చందన, ప్రియాంక, భారతి, నర్సింగ్ సూపరింటెండెంట్ జ్యోతి, ఐసీటీసీ హెల్త్ కౌన్సిలర్ జేసు ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళల సమస్యలపై స్పందించాలి

మహిళల సమస్యలపై ప్రభుత్వాలు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక మీరా గ్రంథాలయం భగత్‌సింగ్ విజ్ఞానకేంద్రం అధ్యక్షుడు ముచ్చర్ల త్రిమూర్తులు అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ సమాజంలో రెండో తరగతి పౌరులుగా చూస్తున్న మహిళలు తమ హక్కులు కోసం 1910 నుంచి పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎం.ఝాన్సీరాణి, టి.పార్వతి, కీర్తి, మరియమ్మ, అలేఖ్య పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే కెరీర్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్నేన రోజారమణి అన్నారు. స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా రోజారమణి మాట్లాడుతూ ముఖ్యంగా తల్లిదండ్రులు ప్రోత్సాహం ఉపాధ్యాయుల దిశానిర్దేశం ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి రాజా రాజేశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివదేవుని చిక్కాల జెడ్పీ హైస్కూల్లో.

మండలంలోని శివదేవుని చిక్కాల జెడ్పీ హైస్కూల్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రాము మాట్లాడుతూ ఒక్క స్త్రీ వల్ల ఆ కుటుంబానికి జరిగే ఉపయోగాలు గురించి వివరించారు. ఈ సందర్భంలో పాఠశాలలో ఉన్న మహిళా ఉపాధ్యాయినులను పసుపు, కుంకుమలు అందించి సన్మానించారు.



నరసాపురం: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కేక్‌కట్ చేస్తున్న దృశ్యం



పాలకొల్లు సెంట్రల్: మాజీ వైస్ చైర్మన్ రోజారమణిని సత్కరిస్తున్న అధ్యాపకులు



యలమంచిలి: చించినాడలో సర్పంచ్ దంగేటి రాజమణిని సన్మానిస్తున్న దృశ్యం



పెనుగొండ: పంచాయతీలో కేక్ కట్ చేస్తున్న మహిళా ప్రజా ప్రతినిధులు

కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో

యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వనిత క్లబ్‌లో కొనసాగుతున్న మహిళలు వైద్యురాళ్లుగా, వ్యాపారవేత్తలుగా అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్నారన్నారు. వారిని కేటగిరిల వారీగా గుర్తించి థ్యాంక్స్‌ఫుల్ అవార్డులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు యామన విజయలక్ష్మి, దేవరపు కాంచనమాల, శిద్ధిరెడ్డి శైలజారాణి పాల్గొన్నారు.

పోస్ట్‌ఉమెన్‌లకు సన్మానం

అంతర్జాతీయమహిళా దినోత్సవం సందర్భంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో ఉన్న పోస్ట్ ఉమెన్‌లను ఘనంగా సన్మానించారు. శనివారం పోస్టాఫీసులో పనిచేస్తున్న ఏడుగురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో యిమ్మిడి రాజేష్, ఆర్‌వీఎస్, ఎస్.కామేశ్వరరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో

మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి అన్నారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ విజయసారథి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని అన్నారు. విజయవాడ సీబీఐ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గంధం శోభనలక్ష్మీ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు అమల్లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మెప్మా సిటీమిషన్ మేనేజర్ రత్నాకర్, సీఓలు సునేత్ర, రాధాదేవి, ఆర్పీలు మాధవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందంజ వేయాలి



నరసాపురం రూరల్: తహసీల్దార్ రాజరాజేశ్వరిని సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మహిళలు పట్టుదలతో, ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో ముందంజ వేయాలని ఏపీఎం జక్కంపూడి నాగభూషణం నాయుడు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మండల సమాఖ్యలో ఏపీఎం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు డ్వాక్రా మహిళలను ఘనంగా సత్కరించారు. వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నరసాపురం తహసీల్దార్ తలారి రాజరాజేశ్వరిని సన్మానించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు నూలి శ్రీనివాస్, కోట్ల బాలకృష్ణ, మండా రాజ, కంచర్ల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

వంటింటి నుంచి అంతరిక్షం వరకు
మహిళలే రాణులు

యలమంచిలి: ఆధునిక యుగంలో మహిళల ప్రస్థానం వంటిల్లు నుంచి అంతరిక్షం వరకు వ్యాపించడం శుభపరిణామమని చించినాడ సర్పంచ్ దంగేటి రాజమణి అన్నారు. మహిళ దినోత్సవాన్ని శనివారం చించినాడ గ్రామ సచివాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉన్న మహిళా ప్రజాప్రతినిధులను, మహిళ ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా రాజమణి మాట్లాడుతూ విద్య వల్లే మహిళలంతా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. సన్మానం పొందిన వారిలో సర్పంచ్ దంగేటి రాజమణి, ఎంపీటీసీ సభ్యురాలు నల్లి సంధ్యారాణి, వార్డు సభ్యులు బి.బేబి శ్రీలక్ష్మి, బి.అరుణకుమారి, ఎస్.సత్యవేణి ఏఎన్ఎంలు వి.కనకదుర్గ, వి.దుర్గాభవాని తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రుద్రరాజు చిన్న, రిటైర్డ్ ఎంఈఓ ముదునూరి రంగరాజు, మాజీ ఎంపీటీసీ విప్పర్తి సాయిబాబు, పంచాయతీ కార్యదర్శి మాదాసు హరిప్రసాద్ పాల్గొన్నారు.

గుంపర్రులో.. గుంపర్రు సచివాలయం వద్ద కూడా మహిళ దినోత్సవం నిర్వహించారు. గ్రామ పెద్దలు జడ్డు రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శి మన్నే మాధురితోపాటు సచివాలయ సిబ్బంది కానుకొలను మనస్విని, ఎం.హేమావతి, ఎం.ఫణిశ్రీలను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తోలేటి లక్ష్మీనారాయణ (చంటి), నంబుల రంగారావు, జడ్డు బాబులు, జడ్డు రాజేష్ పాల్గొన్నారు.

స్త్రీ విద్యతోనే సమాజాభివృద్ధి



పెనుగొండ: నారీ ఆకృతిలో ప్రదర్శన ఇస్తున్న పాఠశాల విద్యార్థులు

పెనుగొండ: స్త్రీ విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ అన్నారు. శనివారం పెనుగొండ పంచాయతీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామ సభ నిర్వహించి కేక్ కట్‌చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సర్పంచ్ శ్యామలాసోనీని సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి టి రత్నాకరరావు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్వీకేపీలో.. జగతికి మూలం మహిళ అని పెనుగొండ ఎస్వీకే పీ అండ్ కేఎస్‌రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అన్నారు. కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో మహిళ ఔన్నత్యాన్ని వివరించారు. అనంతరం ఐక్యరాజ్య సమితిలో మహిళా సాధికారిత, స్త్రీ అవసరాలపై మాట్లాడిన పేకేరు సర్పంచ్ బెల్లంకొండ హేమకుమారిని ఘనంగా సత్కరించారు.

వడలిలో.. వడలిలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ, ఎంపీటీసీ చిటికెన దుర్గాభవానీ, పంచాయతీ సభ్యురాలు వాసా కృష్ణవేణిని సత్కరించారు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన

నరసాపురం: స్థానిక కోర్టు హాల్‌లో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. ఈ లోక్‌అదాలత్‌లో 310 కేసులు పరిష్కరించినట్టు నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి పి.వి జయదుర్గ చెప్పారు. మొత్తం 3 బెంచ్‌లు ఏర్పాటు చేసి కేసులు రాజీ చేశారు. బెంచ్ అధికారులుగా న్యాయమూర్తులు జి.గంగరాజు, కె.శ్రీనివాస్‌లు వ్యవహరించారు. ఈ సందర్భంగా జడ్జి విజయదుర్గ మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గమన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా న్యాయవాదులు జడ్జి విజయదుర్గను సత్కరించారు.

పాలకొల్లులో 176 కేసులు పరిష్కారం

పాలకొల్లు సెంట్రల్: పట్టణ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 176 కేసులు పరిష్కారమైనట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) షేక్ జియాఉద్దీన్ తెలిపారు.

38 ఐపీసీ కేసులు, 6 చెక్ బౌన్స్‌కేసులు, 2 మనోవర్తి కేసులు, ఒక గృహహింస కేసు, 48 ఎక్సైజ్ కేసులు, 15 ప్రామిసరీ నోట్ కేసులు, 2 ఎగ్జిక్యూషన్, 64 బెంచ్ కోర్టు కేసులు మొత్తం 176 కేసులు పరిష్కారం అయ్యాయని వివరించారు. రూ. 66,89,508 లక్షలు నగదు కక్షిదారులకు అందించడం జరిగిందన్నారు. ఈ లోక్ అదాలత్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వి సూర్యనారాయణ, బెంచ్ అడ్వకేట్ మెంబర్ జి.వెంకటేశ్వరరావు, న్యాయవాదులు పీడీఎస్ బాలాజీ, కోట చంటియ్య తదితరులు పాల్గొన్నారు.



నరసాపురం: కోర్టు హాల్లో లోక్‌అదాలత్‌లో కేసులు రాజీ చేస్తున్న దృశ్యం



పాలకొల్లు సెంట్రల్: లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి జియాఉద్దీన్

సీపీఎం ప్రజా చైతన్య సైకిల్ యాత్ర

నరసాపురం రూరల్: స్థానిక సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య సైకిల్ యాత్ర శనివారం నరసాపురం నియోజకవర్గంలోని మొగల్తూరు, నరసాపురం మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి విద్యుత్, రోడ్లు, మంచినీరు, డ్రైయినేజి, అంగన్‌వాడీ, వైద్య సదుపాయం వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. తొలుత మొగల్తూరు మండలంలోని శేరేపాలెం కొత్తూరు, మొగల్తూరులోని నాగదేవత గుడి వీధి ప్రాంతాల్లో సాగిన ఈ యాత్ర సాయంకాలానికి నరసాపురం మండలం సీతారామపురం నార్త్ గ్రామం చేరుకుంది. గ్రామంలోని ఓఎన్జీసీ కాలనీలోని మహిళలు ఖాళీ బిందెలతో వచ్చి సీపీఎం నాయకులకు తమ సమస్యలను వివరించారు. తామంతా తాగునీటికోసం వేరే ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని, తమ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు సీపీఎం నాయకులను కోరారు. అలాగే తాగునీటితో పాటు వీధి దీపాలు, విద్యుత్ సమస్యలను వారి దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, ఆర్డీఓ, ఎంపీడీఓలకు సమస్యను ఫోన్‌లో వివరించి పరిష్కరించాలని కోరారు. గొర్ల రామకృష్ణ, జక్కంశెట్టి సత్యనారాయణ, మమిడిశెట్టి రామంజనేయులు, క్రాంతి బాబు, దుర్గారావు, జల్లి రామ్మోహన్ పాల్గొన్నారు.



సీపీఎం నాయకులకు ఖాళీ బిందెలతో తాగునీటి సమస్యను వివరిస్తున్న మహిళలు.

నేడు వారాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

పెనుమంట్ర: మండలంలోని మల్లిపూడి గ్రామంలో రూ. 14లక్షలు వ్యయంతో నూతనంగా నిర్మించిన వారాహి అమ్మవారి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు గుడిమెట్ల సాయిబాబారెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం వేద పండితులు దోనేపూడి వెంకటసాయి ప్రసాద్, వారణాసి రామలింగశాస్త్రి ఆధ్వర్యంలో పలువురు దాతలు వాస్తు పూజలు, శాంతిహోమ పూజలు జరిపారు. ఆదివారం నిర్వహించే విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.



మల్లిపూడిలో అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్టాపన పూజలలో పాల్గొన్న భక్తులు

చాంబర్స్ విద్యార్థులకు ఉద్యోగాలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చాంబర్స్ కళాశాల క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 89 మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్ లెటర్‌లు వచ్చాయని కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహరావు శనివారం విలేకరులకు తెలిపారు. ఇటీవల కళాశాలలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో తమ కళాశాల నుండి 106 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 89 మందికి విద్యార్థులకు ప్లేస్‌మెంట్ ఇస్తూ ఆఫర్ లెటర్లు వచ్చాయన్నారు. లోరా ఐటీ టెక్నాలజీ 7, ఎస్ఎన్‌టిహెచ్ 17, అరబిందో ఫార్మా 7, నియోలిన్ టెలికమ్ 38, అల్జిగి టెక్ చెన్నై 20 మందిని ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

నేటి నుంచి కనకదుర్గామల్లేశ్వర స్వామి కల్యాణోత్సవాలు

పాలకొల్లు సెంట్రల్: యడ్లబజారు సెంటర్‌లో ఉన్న శ్రీ కనకదుర్గా మల్లేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ ఉత్సవాలు 17వ తేది వరకూ తొమ్మిది రోజులు పాటు నిర్వహించనున్నారు. ఆదివారం రాత్రి 7.15 గంటలకు అమ్మవారి ధ్వజారోహణ పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. సోమవారం రాత్రి 7:29 గంటలకు కనకదుర్గా మల్లేశ్వరస్వామివారి కల్యాణం, మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారి పట్టణ ఊరేగింపు, బుధవారం రాత్రి 7.15 గంటలకు దర్బారు సేవ, గురువారం రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ, లక్ష దీపాలంకరణ, శుక్రవారం ఉదయం పూర్ణాహుతి, దండింపు ఉత్సవం, త్రిశూలస్నానం రాత్రి 7 గంటలకు అమ్మవారికి లక్ష చామంతి పూలతో పూజ, శనివారం లక్ష గాజుల పూజ, ఆదివారం సాయంత్రం అమ్మవారికి సారె మహోత్సవం, సోమవారం ఏకాంతసేవ, శ్రీపుష్పోత్సవం కార్యక్రమంతో ఉత్సవ కార్యక్రమాలు ముగించనున్నారు. ఉత్సవ ఏర్పాట్లను ఈఓ ఎన్.సతీష్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు

గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: పశువులకు వచ్చే ఎఫ్ఎండీ (ఫుడ్ అండ్ మౌత్ డిసీస్) గాలికుంటు వ్యాధి సోకకుండా రైతులు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పశువులకు ఓఖని టీకాలు వేయించాలి. ఈ వ్యాధి ప్రాణాంతకం కాకపోయినా అశ్రద్ధ వహిస్తే మాత్రం పశువులు నెమ్మదిగా క్షీణించిపోయే ప్రమాదం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి వైరస్ ద్వారా వస్తుంది. చాలా వేగంగా సోకుతుంది. గాలి, నీరు, దాణా, మనుషుల ద్వారా కూడా వ్యాపించే గుణం ఉంటుంది. గాలికుంటు వ్యాధి సోకితే పశువులకు 103 నుండి 106 జ్వరం వస్తుంది. నోటిలో పుండ్లు, కాలి గిట్టల్లో పుండ్లు ఏర్పడతాయి. నోటి నుంచి చొంగ కారుతుంది. దానివల్ల అవి ఆహారాన్ని తినే పరిస్థితి కూడా ఉండదు. ఈ వ్యాధిపై అశ్రద్ధ వహిస్తే మరింత ముదిరిపోతుంది. వ్యాధి ముదిరితే ఉత్పాదక శక్తి తగ్గిపోతుంది. దీనిని అరికట్టడం కోసం సంవత్సరానికి రెండు పర్యాయాలు టీకాలు వేయించాలి.



కాలి గిట్టల వద్ద గాలికుంటు వ్యాధి

గాలికుంటు వ్యాధి నివారణ ఇలా

గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు సకాలంలో టీకాలు వేయించాలి. మూడు నెలలు దాటిన అన్ని పశువులకు ఈ టీకాలు వేయవచ్చు. చూడితో ఉన్న పశువులకుసైతం ఈ టీకాలు వేయించవచ్చు. వ్యాధి సోకిన వెంటనే పెయిన్ కిల్లర్లు, బి కాంప్లెక్స్ ఇంజక్షన్‌లు ఇవ్వాలి. నోటిలో పుండ్లు ఏర్పడడం వల్ల మేత తినలేక ఇబ్బందులు పడుతుంటాయి. అందువల్ల అంబలి, జొన్నలతో జావ కాసి పట్టించాలి. వ్యాధి సోకిన వాటిని పశువుల మంద నుంచి దూరంగా ఉంచాలి. వాటి పాల నుంచి దూడలను దూరంగా ఉంచాలి. అలాగే పసుపు, మంచినూనె కలిపి ముద్దలుగా చేసి నోటిలో పుండ్లు ఏర్పడిన చోట రుద్దాలి. ఈ వ్యాధి వల్ల పాల ఉత్పత్తి తగ్గిపోయే ప్రమాదం ఉంటుంది. అందువల్ల రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వ్యాక్సిన్‌లు వేయించాలి.



పశువుల నోటిలో ఏర్పడిన పుండ్లు

31 వరకు వ్యాక్సినేషన్



పశువులకు వ్యాక్సిన్ మార్చి 31 వరకూ వేస్తున్నాం. రైతు వారి పశువులకు అయితే రైతులు శ్రద్ధ తీసుకుంటారు. వీధి పశువులకు ఎవ్వరూ పట్టించుకునే పరిస్థితి ఉండదు. అందువల్ల ఈ నెలాఖరు వరకూ వీధి పశువులకు టీకాలు వేస్తాం. ప్రతి సంవత్సరం టీకాలు మార్చి, సెప్టెంబర్ నెలల్లో రెండు డోసులు వేయించాలి.

– డాక్టర్ జి.మల్లేశ్వరరావు, సహాయ సంచాలకులు ప్రాంతీయ పశువైద్యశాల, పాలకొల్లు